క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగికి పీహెచ్‌డీ



బాపట్లటౌన్: ముత్తాయపాలెం గ్రామ సచివాలయంలో వ్యవసాయశాఖ గ్రామ సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న సిహెచ్ శ్యామ్‌కుమార్ మంగళవారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో అంత్రోపాలజీ (మానవశాస్త్రం) విభాగంలో చేసిన థీసెస్‌కు పీహెచ్‌డీ లభించింది. మణిపూర్‌కు చెందిన అంత్రోపాలజీ (మానవశాస్త్రం) ప్రొఫెసర్ రోమేష్‌సింగ్ నేతృత్వంలో శ్యామ్‌కుమార్ పీహెచ్‌డీ పూర్తిచేశారు. శ్యామ్‌కుమార్‌ను బాపట్ల వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మి, వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆంగ్లంపై భయం వీడాలి



చెరుకుపల్లి: విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై భయం వీడాలని వనజా చంద్ర పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. మండలంలోని గూడవల్లి వనజాచంద్ర పబ్లిక్ స్కూలులో మంగళవారం నిర్వహించిన ఇంగ్లిష్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాతృభాషను నిర్లక్ష్యం చేయకుండా ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్ల భాషపైనా పట్టుసాధించాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు రూపొందించిన సాహిత్య వ్యాకరణాంశాలను ఆంగ్లంలో ప్రదర్శించారు. ప్రదర్శన కార్యక్రమాన్ని మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్వేత, ఐలవరం జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్



బాపట్ల: మండలంలోని విజయలక్ష్మీపురం గ్రామానికి చెందిన మత్స్యకార మహిళలకు ఎస్ టూ నీడ్స్ సంస్థ మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసింది. సంస్థ డైరెక్టర్ తోట సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు కుట్టు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు కుండేటి శివకుమారిని అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాడదాం

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్



కర్లపాలెం: ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా అన్ని వర్గాలూ పోరాటంలో భాగం కావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి ఆయన కర్లపాలెం వచ్చి దళిత నాయకులతో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని చెప్పారు. సభకు కర్లపాలెం మండలం నుంచి అత్యధికులు తరలి రావాలని ఆయన కోరారు. ఆయన వెంట దళిత నాయకులు విజయకుమార్, ఇసాక్, సాగర్, బెనర్జీ, ధర్మేంద్ర, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు: వరద ప్రభావిత ఓలేరు పల్లెపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా జడ్జి, గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, కార్యదర్శులు వైవీఎస్‌బీజీ పార్థసారథి, పి.లీలావతీల ఆదేశాల మేరకు మంగళవారం మండల న్యాయ సేవాధికార ఛైర్మన్, రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంఈవో నీలం దేవరాజు, ఉపాధ్యాయులు ఎస్వీ నరసింహారావు పాల్గొన్నారు.

హెల్మెట్ 'తల'మానికం



బాపట్లలో ప్రజలకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న పట్టణ, రూరల్ పోలీసులు



కర్లపాలెంలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

కర్లపాలెం: ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం కర్లపాలెం సెంటర్‌లో ఆయన హెల్మెట్ ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ఉంటే ప్రమాదాలు జరిగినప్పుడు తలకు రక్షణగా ఉంటుందని చెప్పారు. వాహనాలతో పాటు వాటి యజమానులకూ తప్పనిసరిగా బీమా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన

బాపట్లటౌన్: హెల్మెట్‌లేని ప్రయాణం ప్రాణాంతకమని పట్టణ సీఐ మహ్మద్‌జానీ తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్, గడియారస్తంభం సెంటర్లలో ప్రజలకు హెల్మెట్ వినియోగంపై ప్రజలకు మంగళవారం సాయంత్రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సీఐ మహ్మద్‌జానీ మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గంగాధరరావు, రవాణాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవా' ఆకృతిలో విద్యార్థులు



'స్వచ్ఛతా సేవ' ఆకృతి

తెనాలి: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గత పదిరోజులుగా జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మంగళవారం విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవ ఆకృతిని ఏర్పాటుచేశారు. 350 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులు 'మహాత్మా గాంధీకి జై' అంటూ నినాదాలు చేశారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రసూనాదేవి పర్యవేక్షించారు. గాంధీజీని ఆదర్శంగా శుభ్రత, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పీఈటీ శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీజీని స్ఫూర్తిగా తీసుకోండి



స్వాతంత్ర్యోద్యమ నాటికలో విద్యార్థులు

తెనాలిఅర్బన్: జాతి పిత మహాత్మా గాంధీజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లే సూచించారు. గాంధీ జయంతిని బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో వచ్చి స్వాతంత్రోద్యమ ఘటాలను ప్రదర్శించారు. అవి ఎంతో ఆకట్టుకున్నాయి. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం రావాడానికి గాంధీజీ చేసిన పోరాటాలు మరువరానివన్నారు. శాంతి, అహింస సిద్ధాంతాలతో ఆయన ఉద్యమాలునడిపరాని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజయకుమారి, ఇన్‌చార్జి రేఖారాణి, శారద, సత్యశ్రీ, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉప్పుబజారులో ద్విచక్రవాహనం అపహరణ

తెనాలిరూరల్: తెనాలిలో బైక్ దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలను ఎంతో చాకచక్యంగా మాయం చేసేస్తున్నారు. పట్టణంలో ఓ అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్ ను దొంగలు అపహరించుకు వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. చెంచుపేటకు చెందిన షేక్ సుమన్‌కారు హోల్టింగ్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. గత నెల 29వ తేదీ ఆదివారం రాత్రి గుంటూరు బాడుగకు వెళ్లేందుకు గాను తన మోటార్ బైక్‌ను ఉప్పు బజారులోని రామమందిరం వీధిలో కారు బాడుగకు పిలిచిన వారి అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేసి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయాక గుంటూరు నుండి తిరిగి వచ్చి చూసే సరికి తన బైక్ లేకపోవడంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే అపార్ట్‌మెంట్ సమీపంలోని ఓ ఇంట్లో గల సిసి కెమేరాల్లో బైక్ చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. ఆదివారం రాత్రి 10.44 గంటల సమయంలో నడుచుకుంటూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు బైక్ హ్యాండిల్‌ను తొలగించి కాసేపు అక్కడక్కడే తిరగడం సీసీ కెమేరాల్లో రికార్డయ్యాయి. అనంతరం 10.48 గంటల సమయంలో బైక్‌ను నెట్టుకు వెళ్లడం కెమేరాల్లో నమోదైంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, కౌన్సిలర్ రత్నకుమారి

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 11, 27, 38 వార్డుల్లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డుల్లోని రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేశారు. మురుగు కాల్వలో స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వాట్సాప్ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. వాటిని వెంటనే పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కఠారి రత్నకుమారి, బోయపాటి అరుణ, వీర్లపాటి విజయలక్ష్మి, ఏసీపీ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శతాధిక నాటకకర్త గోపాలరావు చిరస్మరణీయుడు



మాట్లాడుతున్న తన్నీరు శివశంకర్

తెనాలి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకుని అమూల్యమైన నాటకాలను సమాజాలకు అందించి ప్రేక్షకుల చైతన్యానికి దోహదపడిన శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు చిరస్మరణీయులని పలువురు వక్తలు అన్నారు. రూరల్ మండలం పెదరావూరుకు చెందిన ప్రముఖ నాటక రచయిత కొడాలి గోపాలరావు శతజయంతిని మంగళవారం సాయంత్రం స్థానిక 'ఇస్కఫ్' సమావేశపు హాలులో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, నాటకసంస్థ అధ్యక్షుడు చందు సూర్య ప్రసంగించారు. కొడాలి గోపాలరావు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పెదరావూరు ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రజానాట్య మండలిపై 1950 ప్రాంతంలో నిషేధం విధించటంతో ఆంధ్ర క్రాంతి థియేటర్‌ను స్థాపించి, స్వయంగా రాసిన నాటకాలను గ్రామగ్రామాన ప్రదర్శింపజేశారని చెప్పారు. పలనాటి యుద్ధం, బంగారు కలలు సహా పలు సినిమాలకు సంభాషణలు అందించారని వివరించారు. తొలుత గోపాలరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మద్యం దుకాణాలు తెరవకుండా సిబ్బంది నిరసన

ఉన్నతాధికారుల ఒత్తిడితో మధ్యాహ్నం మూడు గంటలకు తెరిచిన వైనం

తెనాలి: ఐఎంఎల్ డిపో పరిధిలోని పలు వైన్ షాపులు మంగళవారం మూతపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వైన్ షాపుల్లో పని చేసే సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్‌లు నిరసన తెలియజేశారు. డిపో పరిధిలోని మద్యం షాపులు మూసివేసి తమ నిరసనను తెలియజేశారు. ఉద్యోగుల నిరసన కారణంగా పట్టణంలోని వైన్ షాపులు, మాల్స్‌తో పాటు పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లోని ప్రభుత్వ వైన్ షాపులు మూతపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ షాపులు మూసి వేసి తమ నిరసనను తెలియజేశారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో మూడు గంటల అనంతరం షాపులను యథావిధిగా తెరిచారు. తెనాలి డిపో కమిటీ అధ్యక్షుడు పినపాటి కొండలరాజు, పినపాటి వంశీ, అన్వేష్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ వల్ల తమ ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తాం

కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల: వృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. వృద్ధుల కోసం ఆశ్రమాలు, డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్టీఆర్ అవార్డు గ్రహీత కె.ఎస్.టి.సాయి మాట్లాడుతూ బాపట్లలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జి.వి.బ్రహ్మం, కోటి సుబ్బారావు, దీవి శ్రీనివాసమూర్తి, రావూరి నరసింహవర్మ, ఆనందకుమార్, డాక్టర్ నరేష్ రెడ్డి, బొలగాని వెంకటేశ్వర్లు, శాంతారామ్, సిద్దయ్య, బందా బాబు, పి.సి.సాయిబాబా, డాక్టర్ శ్రీనివాసులు, పి.చిన వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భట్టిప్రోలు: అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని భట్టిప్రోలు మండలంలో మూడు అంగన్ వాడీ సహాయకురాల (ఆయా) పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రాజెక్ట్ అధికారిణి జి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన-2 (బీసీ-ఏ), భట్టిప్రోలు-5 (బీసీ-బీ), కోళ్లపాలెం-2 (ఎస్సీ)కి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా పోస్టులకు విధిగా 7వ తరగతి ఉత్తీర్ణులై ఆగ్రామంలో నివసిస్తున్న వివాహితై ఉండాలని, 2024 జూన్ ఒకటి నాటికి 21 సంవత్సరాల నుండి 35ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆయాకు రూ. 7 వేలు గౌరవ వేతనం ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ధ్రువీకరణ నకలు పత్రాలతో ఈనెల 10లోగా అమృతలూరు కార్యాలయంలో అందించాలని కోరారు.

నగరం ఎక్సైజ్ సీఐగా శ్రీరామ్‌ప్రసాద్



నగరం: నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా శ్రీరామ్‌ప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా నరసరావుపేట సీఐగా పనిచేస్తున్న శ్రీరామ్‌ప్రసాద్ నగరానికి వచ్చారు. శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సారా, అక్రమ మద్యంను అరికట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పింఛన్లు పంపిణీ

కర్లపాలెం: ప్రభుత్వం 1నే లబ్ధిదారులందరికీ పింఛన్ నగదు అందజేస్తున్నట్టు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. దమ్మనవారిపాలెం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్లోరియా, డీపీఓ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి సుధ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తూములూరులో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం



తెనాలిఅర్బన్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతారని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమోనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

భట్టిప్రోలు: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, బాల వికాస్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత నెల 26న వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భగవంతుడు ఒక్కడే నా నిజమైన స్నేహితుడు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలలో 162 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, బాలవికాస్ సేవాదళ్ నిర్వాహకులు తూనుగుంట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన చింతాయపాలెం విద్యార్థులు

కర్లపాలెం: రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు తెలిపారు. మంగళవారం హెచ్‌ఎం వెంకటరాజు మాట్లాడుతూ గుంటూరులోని ఇండియన్ షూటింగ్ అకాడమీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన షూటింగ్ జిల్లా జట్టుకు మంగళవారం జరిగిన ఎంపికలో అండర్-14 బాలుర విభాగంలో పిట్టు చిన్న అయ్యప్ప రెడ్డి, ఓపెన్ ఫైట్ షూటింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. అండర్ -17 బాలుర విభాగంలో దిడ్ల బాల మణికంఠ రెడ్డి ఓపెన్ ఫైట్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని వెల్లడించారు. ఈనెల 18 నుంచి 20 వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపీని ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణలో బాపట్లది అద్భుత పాత్ర



తెలుగుతల్లి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బాపట్ల: ఆంధ్ర రాష్ట్ర అవతరణలో బాపట్ల అద్భుతమైన పాత్రను పోషించిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. 71వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా టౌన్ హాలులో తెలుగు తల్లి విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ అప్పట్లో ఆంధ్రోద్యమం బాపట్లలోనే పురుడు పోసుకుందని తెలిపారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందని వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకూ ఇక్కడే బీజం పడిందని తెలిపారు. నాలుగు దశాబ్దాల ఉద్యమం అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణంతో ఆంధ్ర రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. అడిషనల్ ఎస్పీ టి.వి.విఠలేశ్వర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏవీ రమణారావు, అధ్యాపకులు కలాం, పౌర సమాఖ్య నాయకులు కె.విజయకుమార్, రమణ కుమార్, నాయకులు యు.వి.రామారావు, గుండ్రెడ్డి సత్యనారాయణ, రచయిత్రి చిల్లర భవానీ దేవి, మానం అప్పారావు,ఎడ్ల సత్యవతి, కరణం రవీంద్ర, సత్యనారాయణ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు 35 మంది ఎంపిక



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 35 మంది బాలబాలికలు వేమూరు నియోజకవర్గ స్థాయిలో ఎస్‌జీఎఫ్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14/17 బాలబాలికల విభాగంలో వేమూరు నియోజకవర్గంలోని పెరవలి, యడ్లపల్లి, జంపని జెడ్పీ హైస్కూళ్లల్లో నిర్వహించిన కబడ్డీ, యోగాసనాలు, బ్యాడ్మింటన్, లాంగ్ జంప్, వాలీబాల్, చెస్, ఖోఖో, 100, 400, 1,500, మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చూపారు. వీరు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో ఆడనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.

- ఎస్‌జీఎఫ్‌ఏ క్రీడలలో సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన అండర్-14/17 బాలికలను, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు.

వరిలో పచ్చ పురుగు నివారణకు చర్యలు



యడవూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డీడీఏ విజయ నిర్మల



చదలవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ సునీత

అమర్తలూరు(వేమూరు) వరి పంటలో పచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దాని నిర్మూలనకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయ నిర్మల అన్నారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పచ్చపురుగు నివారణ మార్గాలు వివరించారు. కార్యక్రమంలో బాపట్ల డివిజన్ వ్యవసాయాధికారి ఎ.లక్ష్మి, మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి రైతులు పాల్గొన్నారు.

- చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా రైతు శిక్షణా అధికారి, ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ పాల్గొని వరిలో చీడపీడల నివారణ గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పి.ఆదంబాబు మాట్లాడుతూ ప్రకృతి సేద్యం, కషాయాల వాడకంపై వివరించారు.
- వేమూరు మండలంలోని వేమూరు మండలంలోని కాకర్లమూడి, చదలవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ సునీత మాట్లాడుతూ సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రక్తదానం చేయండి

తెనాలిఅర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసన్న పేర్కొన్నారు. నేషనల్ వలంటరీ బ్లడ్ డోనేషన్ డే సందర్భంగా జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం పలువురు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీబీయూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బాపనయ్య, రమాదేవి, శ్యామల పాల్గొన్నారు.